# గురుకులాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



-దానవాయిగూడెం గురుకుల అభివృద్ధికి రూ. 3.80 కోట్లు మంజూరు

-పనులను ప్రారంభించిన మంత్రి పొంగులేటి

2లో

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

గురువారం | 13 | నవంబర్ | 2025

పేజీలు : 8

# మొదలైన కటింగ్‌ల మోత..!





## -తడిసిన ధాన్యాన్ని కొనేదెవరు...?
## -నష్టపోయిన రైతులను ఆదుకునేదెవరు..?

**ప్రజాపక్షం/ఖమ్మం :** హామీలు ఆచరణకు నోచుకోవడం లేదు. ముఖ్యంగా రైతాంగ విషయంలో అమలు మరి ఘోరం. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు అన్ని విధాలా ఆదుకుంటామనడం ఆ తర్వాత పట్టించుకోకపోవటం అలవాటుగా మారింది. మొంథా తుఫాన్ ఈ ఏడాది వరి సాగు చేసిన రైతులను తీవ్రంగా నష్టపరిచింది. వరి కోతకు వచ్చిన దశలో భారీ వర్షం రావటంతో గాలికి పైరు కింద పడింది. రెండు రోజులు కురిసిన వర్షాలకు ధాన్యం రంగు మారింది. రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయటం లేదు. మీరు రైసు మిల్లర్లతో మాట్లాడుకుని మిల్లర్లు అంగీకరిస్తేనే తూకాలు వేస్తామంటూ తేల్చి

మిగతా 2లో..

# పెరుగుతున్న క్రెడిట్ కార్డు వేధింపులు..!



-మానసిక ఒత్తిడిలో వినియోగదారులు

-వ్యవధి దాటితే వడ్డీల మోత

**ప్రజాపక్షం/ఖమ్మం :** బ్యాంకుల నుంచి ఫోన్ చేసి క్రెడిట్ కార్డు తీసుకోండి మీ సిబిల్ స్కోర్ చాలా బాగుంది. మీరు క్రెడిట్ కార్డు తీసుకునేందుకు అర్హత పొందారు. వెంటనే బ్యాంకు వేళల్లో సంప్రదించండి అంటూ ఫోన్ కాల్స్ చేస్తుంటారు. అవసరానికి ఉపయోగపడుతుంది ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వినియోగించుకోవచ్చు ఆ తర్వాత చెల్లింపులు చేయవచ్చు అని ఆశ పడి క్రెడిట్ కార్డు తీసుకుంటే సకాలంలో చెల్లిస్తే సరి లేదంటే కాల్ మనీ కేసులను తలపించే రీతిలో ఇబ్బందులను ఎదుర్కోవడంతో పాటు వడ్డీల మోతకు వినియోగదారుల నడ్డి విరగాల్సిందే. తీవ్రమైన మానసిక వేధింపులు ఎదుర్కొనక తప్పదు. కార్డులు వినియోగించుకున్న తర్వాత పరిస్థితులు అనుకూలించక చెల్లింపులు ఆలస్యమైతే ఇష్టానుసారంగా వడ్డీలు వేస్తున్నారు. ఒక రోజు ఆలస్యమైనా వాయింపులు తప్పడం లేదు. ఆ దెబ్బకు క్రెడిట్ కార్డు అంటేనే లబోదిబో అంటున్నారు. వేలకు వేలు జరిమానాతో ఇబ్బందులు పడక తప్పదు. మరింత ఆలస్యమైతే రికవరీ ఏజెంట్ల వేధింపులు, బెదిరింపులు తప్పవు. వినియోగదారులు క్రెడిట్ కార్డు చేతిలో ఉంది కదా అని ఖర్చు చేసి సమయానికి తిరిగి చెల్లించకపోతే మాత్రం శిక్ష అనుభవించాల్సిదే. క్రెడిట్ కార్డు చెల్లింపులు ఆలస్యమైతే తర్వాత వచ్చే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని క్రెడిట్ కార్డును వినియోగించాలి. క్రెడిట్ కార్డు విషయంలో ప్రభుత్వ నిబంధనలను మార్చాలని వినియోగదారులు కోరుతున్నారు. క్రెడిట్ కార్డులు వినియోగదారులకు ఉపయోగపడేలా ఉండాలి కానీ అధిక వడ్డీల భారంతో ప్రజలను ఇబ్బందులు పెట్టేలా ఉండరాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్రెడిట్ కార్డు వినియోగించినప్పుడు సకాలంలో చెల్లించాలి. లేకపోతే ఇప్పుడున్న పరిస్థితుల్లో వడ్డీ మోతతో పాటు వేధింపులు ఎదుర్కొనక తప్పదు తస్మాత్ జాగ్రత్త.

## సిపిఐ వందేండ్ల ముగింపు వేడుకను
# ఉత్సాహభరితంగా జరుపుకుందాం



- సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం
- 40 దేశాల నుండి తరలిరానున్న ప్రతినిధులు
- ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ

**ప్రజాపక్షం/పాల్వంచ:** ఖమ్మం కేంద్రంగా డిసెంబర్ 26న జరిగే సిపిఐ శత వసంతాల ఉత్సవ ముగింపు సభను ఉత్సాహ పూరిత, ఉల్లాస భరిత వాతావరణంలో జరుపుకొందామని, ఇందుకోసం భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కృషి చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. పాల్వంచ పట్టణ పరిధి వికలాంగుల కాలనీలో గల లక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు మున్నా లక్ష్మీకుమారి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ, మండల, పట్టణ కార్యదర్శుల సమావేశం బుధవారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్యానికి ముందే కాన్పూర్‌లో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) దేశ స్వతంత్ర సంగ్రామంలో తనదైన పాత్ర పోషించిందన్నారు.బ్రిటీష్ సామ్రాజ్యవాదుల చెర నుండి దేశానికి విముక్తి కలిగించేందుకు ఎందరో కమ్యూనిస్టు యువకిశోరాలు తమ ప్రాణాలను ఫణంగా పెట్టారని అన్నారు. నాటి నుండి నేటి వరకు పేదలు, బడుగు బలహీన వర్గాలకు ఎర్రజెండా అండగా ఉందన్నారు.భారతగడ్డపై వందేండ్లు పూర్తి చేసుకున్న పార్టీ కేవలం భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనన్నారు.

మిగతా 2లో..

# మొదలైన కటింగ్‌ల మోత..!

(మొదటిపేజీ తరువాయి)
చెబుతున్నారు. రైసు మిల్లర్లను కదిలిస్తే కోతలు అంటూ మొదలుపెడుతున్నారు. గతేడాది క్వింటాకు ఐదు కేజీల నుంచి పది కేజీల వరకు కోతలు విధించిన విషయం విధితమే. ఈ ఏడాది కూడా అదేవిధంగా కోతలు విధించేందుకు సిద్దమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు నష్ట పోకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. గతంలో మిల్లర్ల దోపిడీని అధికార యంత్రాంగం అడ్డుకోలేకపోయింది. ఇక ఈ ఏడాది తడిసిన ధాన్యం పేరుతో రైతులను మరింత దోపిడీ చేసే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్లాల్లోనే తడిసిన ధాన్యం మిగిలిపోవడంతో రైతులు తడిసి రంగు మారిన ధాన్యం కొనుగోలు చేసేందుకు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**పరిహారమేది...?**

మొంథా తుఫాన్ ఈ ఏడాది రైతాంగాన్ని తీవ్రంగా నష్టపరిచింది. ముఖ్యంగా వరి కోతకు వచ్చిన సమయంలో మొంథా తుఫాన్ రావడం భారీ వర్షంతో పాటు ఈదురు గాలులకు వరి నేలకొరిగింది. మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ప్రకటించిన ప్రభుత్వం అధికారులచే పంట నష్ట సర్వేలను కూడా చేయించింది. కానీ ఇంత వరకు రైతులకు పరిహారం అందలేదు. ప్రకృతి విపత్తులు సంభవించిన ప్రతిసారి రైతులను ఆదుకుంటామంటూ అంచనాలు రూపొందించడంతోనే సరిపుచ్చుతున్నారు తప్ప పరిహారం అందించడం లేదు. పరిహారమన్న పదమే ఒక రకంగా పరిహాసమవుతుంది. ఇప్పటికైనా సర్వేలకు అనుగుణంగా తక్షణం పరిహారాన్ని అందించేవిధంగా తగు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

**బోనస్ అందక ప్రైవేటుకు ధాన్యం...**

గతేడాది యాసంగిలో సాగు చేసిన ధాన్యానికి రైతులకు ఇంత వరకు బోనస్ రాలేదు. పదే పదే అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం లేకపోవడంతో ఈ దఫా ధాన్యం రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఎలాగో ధాన్యానికి బోనస్ రావడం లేదని భావిస్తున్న రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు చాలా చోట్ల ధాన్యాన్ని తీసుకు రావడం లేదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనైతే ధాన్యాన్ని ఆరబెట్టి తేమ శాతాన్ని పరీక్షించుకోవాల్సి వస్తుంది. తేమ శాతానికి అనుగుణంగా ఉంటేనే ధాన్యాన్ని విక్రయించాల్సి వస్తుంది. ప్రైవేటు వ్యాపారులు పచ్చి ధాన్యాన్నే కొనుగోలు చేస్తుండడంతో ఇది లాభసాటిగా ఉందని రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. నేలకొండపల్లి మొదలైన కొన్ని చోట్ల ప్రభుత్వ ధాన్యం కేంద్రాలు వెలవెలబోతున్నాయి.

## సిపిఐ వందేండ్ల ముగింపు వేడుకను

# ఉత్సాహభరితంగా జరుపుకుందాం






(మొదటిపేజీ తరువాయి)
నిత్యం ప్రజలతో మమేకమై ఉన్న ఈ పార్టీ మరో నూరేండ్లు కూడా మనగలుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. ప్రజాక్షేత్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాటాలు చేసే పార్టీలను ఎన్నేండ్ల వరకైనా ప్రజలు ఆదరిస్తారని అందుకు సిపిఐ పార్టీయే నిదర్శనమన్నారు. ఖమ్మం కేంద్రంగా జరిగే శతవసంతాల ముగింపు సభకు 40 దేశాల నుండి ప్రతినిధులు తరలిరానున్నారని, కవులు, కళాకారులు, మేధావులు ఈ వేడుకల్లో పాల్పంచుకొంటున్నారని చెప్పారు. ఈ జిల్లా నుండి 3000 మంది రెడ్ షర్ట్ వలంటీర్లను కవాతు కోసం సిద్దం చేస్తున్నామని, దీనికోసం జిల్లా వ్యాప్తంగా 10 కేంద్రాలలో శిక్షణా శిభిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.వేలాది మందితో నిర్వహించనున్న కవాతుతో ఖమ్మం పట్టణం మరింత అరుణవర్ణాన్ని సంతరించుకుంటుందన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా మాట్లాడుతూ పార్టీ శాతాబ్ది వేడుకల ముగింపు సంధర్భంగా ఐదులక్షల మందితో భారీ జనసభ జరుగనుందని చెప్పారు. కమ్యూనిస్టులకు కాలం చెల్లిందంటూ అవాకులు, చెవాకులు పేలిన వారికి ఈ వేడుక చెంపపెట్టు కానుందన్నారు. ముగింపు కార్యక్రమాన్ని పురష్కరించుకొని జిల్లా వ్యాప్తంగా జీపు జాతాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. సిపిఐ చరిత్ర, పోరాటాలను ప్రతీ ఒక్కరికి తెలిపే విధంగా ఇంటింటి ప్రచారం, నిధి సమీకరణ సాగుతుందన్నారు. ఈ భారీ బహిరంగసభ దేశ చరిత్రలోనే ఓ మైలురాయిగా నిలిచే విధంగా జిల్లాలోని అన్ని ప్రాంతాల నుండి లక్షలాదిగా ప్రజలను తరలించేందుకు ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్మికులు, కర్షకులు, మేధావులు, వ్యాపార వర్గాలు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు కే. సారయ్య, సరెడ్డి పుల్లారెడ్డి, రేసు ఎల్లయ్య, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, భూక్యా దస్రు, కమటం వెంకటేశ్వర్లు, దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, మువ్వా వెంకటేశ్వర్లు, అడ్డగర్ల తాతాజీ, మండల, పట్టణ కార్యదర్శులు, ప్రజా సంఘాల జిల్లా బాధ్యులుపాల్గొన్నారు.

# గురుకులాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

**ప్రజాపక్షం/ఖమ్మం :** దానవాయిగూడెం గురుకుల పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని దానవాయిగూడెంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల భవన మరమ్మతులను బుధవారం ఆయన ప్రారంభించారు. గతేడాది మున్నేరుకు వచ్చిన వరదల కారణంగా పాఠశాల మునిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని నిధులు మంజూరు చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గతేడాది వచ్చిన వరదల ఇబ్బందులను చూసిన తర్వాత భవిష్యత్తులో అటువంటి పరిస్థితులు ఎదురు కాకుండా మరమ్మతులు చేయడం జరుగుతుందన్నారు. కాంపౌండ్ వాల్ నిర్మించడంతో పాటు జనరేటర్‌ను కూడా ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. భూమిని సమతలంగా చేసి క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తామని పొంగులేటి తెలిపారు. బాలికలు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. ఇక్కడ మరిన్ని సదుపాయాలకు సంబంధించి నివేదిక అందజేయాలని అధికారులను కోరారు. విద్యార్థుల కోరిక మేరకు క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటును పరిశీలించాలని కలెక్టర్‌కు సూచించారు. పిఎస్ఆర్ ట్రస్టు నుంచి ఫర్నీచర్ పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. నాణ్యతతో కూడిన పనులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ శ్రీజ, జిల్లా పౌర సంబంధాల అధికారి చందన్‌కుమార్, వ్యవసాయ అధికారి పుల్లయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**సహాయ నిధి చెక్కును అందించిన పొంగులేటి :**



అనారోగ్యంతో బాధపడుతున్న కూసుమంచి మండలం ధర్మాతండాకు చెందిన జర్పుల సింధుకు రూ. 1.75 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందజేశారు. గతంలో సింధు అనారోగ్యంతో బాధపడుతుండగా మంత్రి పరామర్శించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తామన్న వాగ్దానాన్ని చెక్కు అందించి నిలబెట్టుకున్నారు. బుధవారం కూసుమంచి మండల పరిధిలోని పలువురిని పరామర్శించారు. బానోత్ మంగ్యానాయక్, దరావత్ రామోజీ నాయక్, చేగొమ్మకు చెందిన వలికొండ శ్రీనివాస్ కుటుంబాలను పరామర్శించారు. మంగలితండాలో విద్యుత్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రూ. 10లక్షల విలువ గల చెక్కులను అందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆపదలో ఉన్న వారిని అన్ని విధాలా ఆదుకుంటుందని ఆయన తెలిపారు.

## సంక్షేమ అధికారులు అందించే సేవలు మరువలేనివి

**ప్రజాపక్షం/సత్తుపల్లిః** జే.వి.ఆర్ ఓసి నందు విధులు నిర్వహిస్తున్న సీనియర్ పి.ఓ అధికారి దేవదాస్ కొత్తగూడెం సింగరేణి సూపర్ బజార్ కు బుధవారం బదిలీపై వెళుతున్న సందర్భంగా ఐఎన్‌టియూసి బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతి కుమార్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. సింగరేణి సంస్థను లాభాల్లోకి తీసుకురావడానికి కార్మికులు పడుతున్న కష్టాన్ని గుర్తించి కార్మిక వర్గానికి సంస్థకు వారధిగా నిలుస్తు కార్మికులకు న్యాయబద్దంగా రావలసిన సంక్షేమఫలాలను ఎప్పటికప్పుడు కార్మిక కుటుంబ సభ్యులకు చేరవేస్తూ సంక్షేమ అమలు కోసం వారు కీలక పాత్ర పోషించారని, వెల్ఫేర్ ఆఫీసర్ సేవలు కంపెనీలో చాల విలువైనవని, ఎన్నటికీ కార్మిక వర్గం మరువలేనివన్నారు. సత్తుపల్లి జే.వి.ఆర్ ఓసి లో సంక్షేమ అధికారి దేవదాస్ సుమారు మూడు సంవత్సరాలు ఉద్యోగులతో కలిసిమెలిసి, కార్మిక వర్గానికి సేవలు అందిస్తూ కార్మికుల మనసులో సముచిత స్థానం దక్కించుకున్న అధికారుల్లో దేవదాస్ ఒకరని కొనియాడారు.

## బిర్సా ముండా జయంతిని జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** బిర్సా ముండా జయంతిని జయప్రథం చేయాలని ఐటిడిఏ ఏపిఓ డేవిడ్ రాజ్ అన్నారు. ఈనెల 15న జరిగే ముండా జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంఎల్ఏలు, కలెక్టర్లతోపాటు అధికారులు, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొనాలన్నారు. బుధవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా ఆదివాసీ సాంప్రదాయ ప్రకారం ఆచారవ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు, ఆదివాసీ వ ంటకాలతో వారిని ఆనందింప జేసే విధంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వచ్చే అతిథితులకు ఎలాంటి లోటు పాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కార్యక్రమాలు నిర్వహించే గిరిజన భవన్ వేదికను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

## క్రీడా పట్టుదలతో విజయ శిఖరాలు అధిరోహించాలి



**ప్రజాపక్షం/మణుగూరుః** క్రీడా పట్టుదలతో విజయ శిఖరాలు అధిరోహించాలని మణుగూరు ఏరియా ఇన్‌ఛార్జ్ జనరల్ మేనేజర్ డి. వెంకట రామారావు ఆకాంక్షించారు. సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా డబ్ల్యూపిఎస్ అండ్ జిఏ విభాగం ఆధ్వర్యంలో 202526 సంవత్సరానికిగాను నిర్వహించబడుతున్న కంపెనీ స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలు బుధవారం పి.వి కాలనీ భద్రాద్రి స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై, క్రీడా పతకాన్ని ఆవిష్కరించి, టోర్నమెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. సభను డిజిఎం (పర్సనల్) ఎస్. రమేశ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ జనరల్ మేనేజర్ డి. వెంకట రామారావు మాట్లాడుతూ "క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక ధృఢత్వాన్ని పెంపొందిస్తాయి అన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపే క్రీడాకారులు రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతారు అన్నారు. ఆ స్థాయిలో నిలవాలంటే నిరంతర సాధన, పట్టుదల, ఆత్మవిశ్వాసం అవసరం అన్నారు. క్రీడాస్ఫూర్తితో పోటీలు ఆడితే తప్పక విజయాన్ని సాధించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ ఆర్. శ్రీనివాస్, ఎస్వీ టూ జిఎం అండ్ డబ్ల్యూపిఎస్ అండ్ జిఏ ఉపాధ్యక్షులు బి. శ్రీనివాస చారి, డిజిఎం (పర్సనల్) డబ్ల్యూపిఎస్ అండ్ జిఏ చీఫ్ కో ఆర్డినేటర్ ఎస్ రమేశ్, గుర్తింపు సంఘం ఏఐటియూసి నాయకులు మేకల ఈశ్వర్, ఐఎన్‌టియూసి వైస్ ప్రెసిడెంట్ వి. కృష్ణం రాజు, సిఎంఓఏఐ ప్రతినిధి పి. రమేశ్ , ఓసి 2 సంక్షేమ అధికారి వంశీ కృష్ణ, వివిధ విభాగాల అధికారులు, స్పోర్ట్స్ సూపర్ వైజర్ కార్పొరేట్ పాసినేట్, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అండ్ అస్సిస్టెంట్ స్పోర్ట్స్ సూపర్ వైజర్ జాన్ వెస్లీ, అశోక్, శ్రీనివాస్, రమేశ్, కోఆర్డినేటర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, ఉద్యోగ క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని పొన్నెకల్లుపంచాయతీపరిధిలోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 54మంది విద్యార్థులు స్కీనేడర్ ఎలక్ట్రికల్ లిమిటెడ్ చెన్నైకు ఎంపికయినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జే.లక్ష్మినారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనిని ఇటీవల కళాశాలలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో బాగంగా విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచి సాధించారన్నారు. ఎంపికయిన విద్యార్థులు వార్షికంగా రూ.3.6లక్షల వేతనం పొందనున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ డాక్టర్ వి.సుదర్శన్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ వైశాలి, డిప్లొమా ఇన్‌చార్జ్ కృష్ణప్రసాద్, వివిధ విబాగాధిపతులు డాక్టర ప్రణతి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ చార్యులు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు చెల్లించాలి

**ప్రజాపక్షం/జూలూరుపాడుః** మండల కేంద్రంలో సిఐటియు మండల మహాసభ కామ్రేడ్ కంగాల బుచ్చయ్య భవన్ లో కామ్రేడ్ పూనేమ్ ఝాన్సీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన మహాసభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కే బ్రహ్మాచారి మాట్లాడుతూ మండలంలో కిరాణా షాపులో కోడిగుడ్లు అప్పులు తీసుకొచ్చి మధ్యాహ్న భోజన వర్కర్లు స్కూల్లో పిల్లలకి భోజనాలు పెడుతున్నారని ఆగస్టు నెల నుండి కార్మికులకు బిల్లులు వేయట్లేదని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు మంజూరు చేయాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా పోరాటానికి సిఐటియు పూనుకుంటుందని, తక్షణమే అధికారులు స్పందించి మధ్యాహ్న భోజన బిల్లులు మంజూరు చేయాలని అన్నారు. ఈ మహాసభలో సిఐటియు మండల నూతన కన్వీనర్ గా బోడ అభిమిత్రను ఏకగ్రీవంగా మహాసభలో ఎన్నుకోవడం జరిగింది. ఈ మహాసభలో సిఐటియు మండల నాయకులు నీలిమ, వెంకటలక్ష్మి , రాజ్యలక్ష్మి , తిరుపతమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదాన్ని అంతమొందించాలి

**-కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి**
**-ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ బొమ్మ దగ్ధం**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉగ్రవాదాన్ని కూకటి వెళ్లతో అంతమొందించాలని, ఢిల్లీ బాంబు పేలుళ్ల ఘటనకు నైతిక బాధ్యతవహిస్తూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ తెలిపారు. ఈ ఘటనకు పాల్పడిన ఉగ్రవాదులను అరెస్టు చేసి చట్టప్రకారం శిక్షించాలన్నారు. బుధవారం ఖమ్మం కొత్త బస్టాండ్ సెంటర్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ఢిల్లీలో శాంతిభద్రతలు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నియంత్రణలో ఉన్నాయని చెప్పిన అమిత్‌షా ఇంతటి ఘోరం జరుగుతున్నా ఇంటిలిజెన్స్, నేషనల్ ఇంటిలిజెన్స్ ఏజెన్సీ తదితర విభాగాలు నిద్రావస్థలో ఉండటం శోచనీయమన్నారు. కేంద్రంలోని మోడీ ద్వంద పాలనకు నిదర్శనమన్నారు. దేశ భద్రత కల్పించడంలో అమిత్‌షా తన పాత్ర మరిచిపోయి ఎన్నికల ప్రచారంలో బిజిగా ఉన్నారని ధ్వజమెత్తారు. పెహల్‌గాం దాడి తర్వాత కూడా ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోలేదన్నారు. ఇంటిలిజెన్స్ వైఫల్యాన్ని ఏఐఎస్ఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఉగ్రదాడిలో మరణించిన వారికి కోటి రూపాయలు, గాయపడిన వారికి రూ. 25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు పోటు పూర్ణ చందర్‌రావు, జిల్లా సహాయ కార్యదర్శులు శివ, వంశీ, గోపి, ఉపేందర్, చరణ్ సాయి, ప్రణయ్, కుమార్, సలీం, ఇస్మాయిల్, అబీద్, సుమంత్, జాఫర్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 16న కమ్మ వన సమారాధన

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కమ్మ మహాజన సంఘం ఖమ్మం ఆధ్వర్యంలో ఈనెల 16న కమ్మ వారి కార్తీకమాస వన సమారాధన కార్యక్రమాన్ని మరింత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొల్లు రఘు సత్యనారాయణ, చావా రాము లు తెలిపారు. బుధవారం చెరుకూరి వారి మామిడితోటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 16న ఆదివారం ఖమ్మం నగరం గొల్లగూడెం కొత్తగూడెం రోడ్డులోని చెరుకూరి వారి మామిడి తోటలో కమ్మ వారి కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వన సమారాధన ప్రధాన లక్ష్యం సమాజంలో బంధుత్వం, ఏకతా భావం, పరస్పర అవగాహన పెంపొందించడం అని తెలిపారు. ఈ కార్యక్రమం మన సమాజ ఐక్యతకు ప్రతీక. కుటుంబాలు, పిల్లలు, మహిళలు, యువత అంతా కలిసి ఆనందం పంచుకునే వేదికగా వన సమారాధన నిలుస్తుందన్నారు. ఈ ఏడాది వన సమారాధనలో భక్తి కార్యక్రమాలు, దేవతారాధనలు, పిల్లల గేమ్స్, మహిళల కోసం ప్రత్యేక పోటీలు, వంటల పోటీలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, తెలుగు సంప్రదాయ కళలను ప్రతిభింభించే వినోద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా సినీ కళాకారుల సంగీత విభావరి, కబడ్డీతో పాటు పలు క్రీడా పోటీలు కూడా ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయన్నారు. తెలంగాణ సంస్కృతి, మట్టి వాసన ప్రతిభింభించేలా వేదిక ఆలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు రూపొందించామన్నారు. కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో హాజరై వన సమారాధన విజయవంతం చేయాలన్నారు. ఈ వన సమారాధనకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుకాచౌదరి, ఎంఎల్‌సి తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్,



మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, రాష్ట్ర గిడ్డంగుల కార్పోరేషన్ సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు తో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. వన సమారాధన కార్యక్రమ విజయవంతానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. పలు కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నున్నా మాధవరావు, మందడపు సుధాకర్, వనమా వాసు, చిరుమామిళ్ల నాగేశ్వరరావు, మందడపు రామకృష్ణ, కొత్తపల్లి నీరజ, వైవి, బత్తిని నాగప్రసాద్, బాబ్జీ, కేతినేని హరీష్, కొల్లి వెంకటేశ్వరరావు, గరికపాటి వెంకట్రావు, రావూరి సైదబాబు, దిరిశాల వెంకటేశ్వరరావు, వల్లభనేని రామారావు, నున్నా నవీన్, శరత్, సంఘం వైస్ ప్రెసిడెంట్ కర్నాటి రమాదేవి, జాయింట్ సెక్రటరీ వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తాళ్లూరి నిర్మలకుమారి, కార్యవర్గ సభ్యులు మోత్కూరి సత్యనారాయణ, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, దరమెట్ల స్వరూపరాణి, నంబూరి సత్యనారాయణ ప్రసాద్, డాక్టర్ పోతినేని భుమేశ్వరరావు, నల్లమల ఆనంద్, కోలేటి నవీన్, తాళ్లూరి మురళీకృష్ణ, బండి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్రిమెంట్ ద్వారానే మొక్కజొన్న సాగు చేయాలి

**-ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు**

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** విత్తన మొక్కజొన్న సాగు చేసే రైతులు అగ్రిమెంట్ ద్వారానే సాగు చేయాలని ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని రాములుతండా, రాంక్యాతండా, ఈర్లపుడి, చెరువుకొమ్ముతండా, మంచుకొండ గ్రామల్లో విత్తన మొక్కజొన్న సాగు చేసే రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు



మాట్లాడుతూ విత్తన మొక్కజొన్న సాగు విత్తన చట్ట పరిధిలో లేనందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విత్తన మొక్కజొన్న సాగు చేసే రైతులు విత్తన కంపెనీ ద్వారా సీడ్ ఆర్గనైజర్లకు అగ్రిమెంట్ ఉందో లేదో పరిశీలించాలన్నారు. ఏ విత్తన కంపెనీ అగ్రిమెంట్ ద్వారా విత్తనాలు ఇస్తున్నారో రైతులు తెలుసుకోవాలన్నారు. ఆర్గనైజనర్లు (కంపెనీ ప్రతినిధులు) నుంచి అగ్రిమెంట్ ద్వారా మాత్రమే విత్తన మొక్కజొన్న సాగు చేయాలని రైతులకు సూచించారు. అగ్రిమెంట్ లేకుండా ఏజెంట్ల మాటలు నమ్మి విత్తన మొక్కజొన్న సాగు చేస్తే నష్టపోయే అవకాశం ఉందన్నారు. రైతులను ఆకట్టుకునేందుకు ముందుగా ఎకరానికి కొంత నగదును ముట్టజెప్పి పంట పండిన తర్వాత డబ్బులు ఇవ్వకుండా మోసం చేయడం జరుగుతుందన్నారు. రైతులు తప్పనిసరిగా అగ్రిమెంట్ చేసుకున్న తర్వాతే సాగు చేయాలన్నారు. రైతులు విత్తన సాగు చేసే సమయంలో కంపెనీ శాస్త్రవేత్తలు క్షేత్రాలను సందర్శించి సాంకేతిక సలహాలు అందించేలా ఏజెంట్లు వ్యవహరించాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి, ఏఈవోలు శిరణ్మయి, వేదవ్యాస్, ప్రతిభ, శ్రీకాంత్, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మృత్యుంజయస్వామికి అన్నాభిషేకం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలో వేంచేసియున్న శ్రీ మృత్యుంజయస్వామి దేవాలయం నందు కార్తీక మాసం సందర్భంగా ప్రతిరోజు నిర్వహించే అభిషేక కార్యక్రమాల్లో భాగంగా బుధవారం మహాశివునికి అన్నాభిషేకం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణశర్మ మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా ప్రతిరోజు అభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 50కేజిల బియ్యంతో అన్నాభిషేక కార్యక్రమాన్ని భక్తులతో స్వామివారిని అలంకరించడం జరిగింది. అదేవిధంగా స్వామి వారికి బెల్లం, కూరగాయలు, పండ్లతో అలంకరించిన అలంకరణ చూడటానికి కన్నుల పండుగగా ఉండగా అధికసంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# సిపిఐ నాయకురాలు భూక్య మారు మృతి

**- నివాళులర్పించిన సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం తనగంపాడుగ్రామ పంచాయతీపరిధిలోని గుండాలతండాకు చెందిన సిపిఐ నాయకురాలు భూక్య మారు(65) అనారోగ్యంతో బుధవారం ఇంటి వద్ద మృతి చెందింది. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు పుచ్చకాయల కమలాకర్‌తో కలిసి మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండాను కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉండగా..ఒక కుమారుడు భూక్య రవి సిపిఐ శాఖ సెక్రటరీగా కొనసాగుతున్నాడు. నివాళులర్పించిన వారిలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణకుమార్, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, స్థానికి నాయకులు పొడేటి అంజయ్య, భూక్య రవి, వీరన్న, అజ్మీర లక్క, ప్రసాద్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ సానుభూతిపరుడు కృష్ణమూర్తి మృతి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్ లోని 28వ డివిజన్‌కు చెందిన గువ్వల కృష్ణమూర్తి(63) అనారోగ్యంతో బుధవారం ఇంటి వద్ద మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, మండల సమితి సభ్యుడు దండి రంగారావు అక్కడి శాఖ సభ్యులతో కలిసి మృతదేహాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ 28వ డివిజన్ సెక్రటరీ లగిశెట్టి రమేష్, 29వ డివిజన్ సెక్రటరీ వెంపటి రాము, డివిజన్ బాధ్యులు నారపొంగు నరసమ్మ, నారపొంగు శ్రీను, బూరెల రాము, నిమ్మనబోయిన పాండురంగ, దేవయ్య, 30వ డివిజన్ సెక్రటరీ మిరియాల నరుణ్‌తేజ్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

**-పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా ఖమ్మంను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పిలుపునిచ్చారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ (ఎయిడ్) సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహ నిర్మూలనకై వంద రోజుల ప్రచార ఉద్యమ గోడ పత్రికను బుధవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని తెలంగాణ లక్ష్యంలో భాగంగా ఖమ్మం జిల్లాను బాల్య వివాహ రహిత మొట్టమొదటి జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలన్నారు. ఆడపిల్లల సర్వతోముఖాభివృద్ధికి బాల్య వివాహాలు అడ్డుగోడలు కాకూడదన్నారు. ఆడపిల్లలను పుట్టనిద్దం, చదవనిద్దం, ఎదగనిద్దమని తెలిపారు. ఎవరైనా బాల్య వివాహాలు చేయడానికి ప్రయత్నించిన, సహకరించిన చట్టప్రకారం శిక్షార్హులవుతారని తెలిపారు. బాలల యొక్క సమస్యలపై 24 గంటలు పనిచేసే చైల్డ్‌లైన్ 1098కు ఫోన్ చేసి తెలపవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి, ఎయిడ్ సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ కె. శ్రీనివాస్, వి. రాజేష్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో చందునాయక్, ఉమెన్ హబ్ బాధ్యులు సమీన్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలి

**-కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన మార్కెటింగ్ డైరెక్టర్**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మి బాయి తెలిపారు. బుధవారం రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మి బాయి అధికారులతో కలిసి ఖమ్మం మార్కెట్ కమిటీ, మద్దులపల్లి మార్కెట్ కమిటీల పరిధిలోని సాయిబాలాజీ, జిఆర్‌ఆర్ జిన్నింగ్ మిల్లులను తనిఖీ చేశారు. పొన్నెకల్లులోని సిసిఐ కొనుగోలు కేంద్రం వద్దకు పత్తి విక్రయానికి వచ్చిన రైతులతో డైరెక్టర్ మాట్లాడారు. క్రయ విక్రయాల సమయంలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల పనితీరు గురించి చర్చించి పలు రికార్డులను డైరెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల వద్ద ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలన్నారు. మార్కెట్ కమిటీ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎటువంటి ఇబ్బందులు రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ 2 పురం రవికుమార్, జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాసరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్, సిసిఐ బయ్యర్ వరప్రసాద్, అసిస్టెంట్ కార్యదర్శి వీరాంజనేయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి వాలీబాల్ క్రీడలు ప్రారంభం



ప్రజాపక్షం/ మధిర : మధిర పట్టణంలోని టివిఎం హైస్కూల్ నందు రెండురోజులు పాటు నిర్వహించనున్న ఖమ్మం జిల్లా స్థాయి పాఠశాలల వాలీబాల్ క్రీడా పోటీలను తహశీల్దార్ రాంబాబు, మధిర టౌన్ సిఐ రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి, శారీర దారుఢ్యానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములను విద్యార్థులు సమానంగా తీసుకోవాలని, విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడలు ఎంతోగానో ఉపయోపడుతాయన్నారు. అనంతరం వాలీబాల్ క్రీడా పోటీలను అడిషనల్ కలెక్టర్, విద్యాశాఖ అధికారి పి.శ్రీజ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. క్రీడలను విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని సూచించారు. మొదటిరోజు అండర్ 14, అండర్ 17 బాల బాలికల విభాగాల్లో వాలీబాల్ క్రీడా పోటీలు ఉత్సాహాభరితంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంఇఓ క్రీడల కన్వీనర్ వై.ప్రభాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పిడి వై.చిన్ని, కో కన్వీనర్ ఎంఎం రాజకుమారి, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## మడుపల్లి బస్తి దవఖానాకు బెడ్ వితరణ



ప్రజాపక్షం/ మధిర : మధిరమున్సిపాల్టీ పరిధిలోని మడుపల్లి దవఖానాకు అదే గ్రామానికి చెందిన మధిర ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ శీలం వీరవెంటరెడ్డి తల్లి శీలం భద్రమ్మ జ్ఞాపకార్థం పేషెంట్ బెడ్‌ను వితరణగా అందించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీరాజ్ మాట్లాడుతూ మడుపల్లి దవఖానాలో రోగుల సౌకర్యార్థం బెడ్‌ను అందించిన దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ వెంకటేశ్వరరావు, గోవిందు, సరోజిని, మెడికల్ ఆఫీసర్ కుసుమ, స్టాఫ్ నర్స్ వెంకట్‌లక్ష్మీ పాల్గొన్నారు.

## జాతీయస్థాయి కరాటే పోటీల్లో రమేష్ స్కై స్కూల్ విద్యార్థుల ప్రతిభ




ప్రజాపక్షం/పెనుబల్లిః పెనుబల్లి మండలం రమేష్ స్కై స్కూల్ కి చెందిన విద్యార్థులు కరాటే లో ప్రతిభ ఆయుష్ కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా వారు ఆదివారం దేవరకొండ నల్గొండ జిల్లా లో నిర్వహించిన కరాటే పోటీలలో కటా విభాగంలో ఎనిమిదో తరగతి చదువుతున్న పెరుమాళ్ళ సాత్విక్ అండర్ 14 జూనియర్స్ కటా విభాగంలో ప్రథమ స్థానం, జూనియర్ కటా విభాగంలో పెరుమాళ్ళ రిత్విక్ ద్వితీయ స్థానం సాధించారు. ఈ విజయం సాధినందుకు శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ మరకాల రేవంత్ ను, గెలుపొందిన విద్యార్థులను రమేష్ స్కై స్కూల్ కరెస్పాండెంట్ కురువేటి లలిత భవాని, ప్రిన్సిపాల్ కురువేటి రమేష్ బాబు , పీ.టి సుధీర్ , స్కూల్ యాజమాన్యం పత్యేక అభినందనలు తెలిపారు.

## దేవదాసుకు ఘన సన్మానం



ప్రజాపక్షం/సత్తుపల్లిః పట్టణ పరిధిలోని జలగం వెంగళరావు సింగరేణి ఉపరితల గని కార్యాలయంలో సంక్షేమ (వెల్ఫేర్ ఆఫీసర్) అధికారిగా విధులు నిర్వర్తించి కొత్తగూడెం సింగరేణి సూపర్ మార్కెట్ కు మేనేజర్ గా పదోన్నతిపై బదిలీ అవుతున్న దేవదాస్ ను సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది, ఏఐటియూసి నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ టి యు సి బ్రాంచ్ సహాయ సెక్రటరీ భరణి, కాగిత వెంకటేశ్వర్లు, ఉపేంద్ర చారి, నరేందర్, బాల సుబ్రహ్మణ్యం, సంజీవరావు, మహేష్, వినయ్, రాజేష్, డానియల్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, శ్రీకాంత్, రాజేశ్వరరావు, కృష్ణారావు, బద్రు, ఎస్ అండ్ పిసి జూనియర్ ఇన్స్పెక్టర్, జమేధర్ లు, సీనియర్ సెక్యూరిటీ గార్డ్స్, ప్రైవేట్ సెక్యూరిటీ సూపర్వైజర్లు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన విద్యుత్ పవర్ ట్రాన్స్‌ఫారం ఏర్పాటు



ప్రజాపక్షం/ఎర్రుపాలెం : మండల పరిధిలోని వెంకటాపురం సబ్‌స్టేషన్ నందు ప్రస్తుతం ఉన్న 5ఎంవిఎ పవర్ ట్రాన్స్‌ఫారంతో పాటు అదనంగా మరొక నూతన 5ఎంవిఎ ట్రాన్స్‌ఫారం ఖమ్మం ఎంఆర్‌టి డిఇ బద్రుపవర్ ప్రారంభించారు. ఈ ట్రాన్స్‌ఫారం ఏర్పాటుతో ప్రస్తుతం ఉన్న పవర్ ట్రాన్స్‌ఫారం నందు ఏదైనా అవాంతరాలు తలెత్తి విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు అదనంగా ఏర్పాటు చేసిన పవర్ ట్రాన్స్‌ఫారం ద్వారా వినియోగదారులకు అంతరాయాలు లేని నిరంతరం విద్యుత్ సరఫరా అందించే అవకాశం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో వైరా డివిజన్ డిఇ బండి శ్రీనివాసరావు, మధిర సబ్ డివిజన్ ఎడిఇ ఎం.అనురాధ, ఎర్రుపాలెం సెక్షన్ ఎఇ జి.అనూష, ట్రాన్స్‌ఫార్మ్స్ ఎఇ బొజ్జ నాయక్, లైన్ ఇన్స్‌పెక్టర్ పుల్లయ్య, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తపుంతలు తొక్కుతున్న ఇసుక అక్రమ రవాణా..!

**- అధికారులను ఏమార్చిన అక్రమార్కులు**
**- అధికారిక ర్యాంపులను ఏర్పాటు చేయాలి**



ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచ వ్యాప్తంగా ఇసుక మాఫియా రెచ్చిపోతున్నది. దొంగలు దొంగలు ఊర్లు పంచుకొన్న చందాన ముఠాలుగా వేరైన ఇసుక మాఫియా మొర్రేడు, కిన్నెరసాని పరీవాహక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొంటున్నారు. విలువైన సహజ సంపదను దోచుకొంటూ లక్షలు వెనకేసుకొంటున్నారు. టిప్పర్ ఓనర్ల ధాటికి ట్రాక్టర్ యాజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటూ నెలవారీ కిస్తీలు కట్టలేక సతమతమవుతున్నారు. ఇందుగలడని, అందులేడని సందేహం వలదు ఎందెందు చూసినా అందందే గలడనే సామెతలాగా కొందరు వ్యక్తులు తమ రాజకీయ జెండాలను ఏమార్చుతున్నారు. దోపిడే పరమావధిగా, లక్ష్యం చేసుకొంటూ కొందరు బడాబాబులు ఏపార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి జంపవుతున్నారు. కండువాలు మార్చుతున్నారు. వారి అందదండల పేరుతో దోపిడీకి తెరలేపుతున్నారు. రాజకీయ పార్టీలకు మాయని మచ్చలా తయారవుతున్నారు. ఆర్థిక పలుకుబడితో అధికారులను నయానో భయానో తమ దారికి తెచ్చుకొంటున్నారు. వారి మాటలను లెక్కచేయని అధికారులపై పెద్ద మొత్తంలో మామూళ్ళు ఇచ్చామంటూ తప్పుడు ఆరోపణలు చేస్తూ వారిని మానసిక వేదనకు గురిచేస్తుంటారు. మండల పరిధి రంగాపురం, నాగారం, సంగం, దంతెలబోర తదితర గ్రామాల సమీపంలోని కిన్నెరసాని వాగులో ఇసుకను తోడేస్తున్నారు. ఒకరి ర్యాంపు మరొకరు వెళ్ళకుండా రింగవుతున్నారు. అంతా వారి చెప్పుచేతల్లోనే ఇసుక రవాణా జరిగేటట్లు చక్రం తిప్పుతూ ట్రాక్టర్ యాజమానుల వద్ద నుండి ఒక్కో ట్రిప్పుకు రెండు నుండి మూడు వందల వరకు బలవంతపు వసూళ్ళకు తెగబడుతున్నారు. రాత్రి 11 గంటలు అయితే చాలు ఒక్కొక్కరు కిన్నెరసాని కడుపుకోతకు తయారవుతారు. వారికి అనుకూలమైన వ్యక్తుల ట్రాక్టర్‌ల ద్వారా ఇసుకను డంపు చేస్తారు. అనంతరం జేసిబి లాంటి భారీ యంత్రాలతో టిప్పర్‌లలో లోడ్ చేసి పాల్వంచ, కొత్తగూడెం, ఖమ్మం తదితర ప్రాంతాలకు తరలిస్తుంటారు. రాంగాపురం గ్రామ సమీపంలోని మామిడి తోట, నాగారం సమీపంలో నిర్మానుష్య ప్రాంతం, సీతారామ ప్రాజెక్టు సమీపంలోని ఓ వ్యక్తి జమాయిల్ తోటల్లో భారీగా ఇసుక నిల్వలను చేస్తూ టిప్పర్ లారీల ద్వారా పట్టణ ప్రాంతాలకు తరలిస్తూ పెద్ద మొత్తంలో ప్రభుత్వ సంపదను దోచుకొంటూ వెనకేసుకొంటున్నారు. దీని కోసం భారీ ఎత్తున నిఘా ఏర్పాటు చేసుకొంటున్నారు. పాల్వంచ నుండి కిలోమీటర్‌కు ఒకరు చొప్పున వారి మనుషులను పెడుతూ అధికారుల రాకను పసిగడుతున్నారు. సమాచారం మేరకు ఎవరైన అధికారులు తనిఖీలకు వెళితే మేము ఫలానా పార్టీ వారిమంటూ మా స్వంత అవసరాలకు ఒక్క ట్రిప్పు మాత్రమే అని చెప్పి తాత్కాలికంగా తప్పించుకొంటున్నారు. పెడ చెవిన పెట్టిన అధికారులపై దాడులకు కూడా వెనకాడటం లేదు. గత కొన్ని రోజుల క్రితం ఓ ట్రాక్టర్‌ను అటవీ అధికారులు పట్టుకొన్న సమయంలో సదరు ట్రాక్టర్‌కు చెందిన వ్యక్తి అదికారిపై దాడి చేసి భయభ్రాంతులకు గురిచేసిన ఘటనలో గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటం జరిగింది. ఈ నెల 10వ, తేదీన పాల్వంచ గుడిపాడు నుండి ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ రెవిన్యూ అధికారులకు చిక్కింది. పట్టుకొన్న అధికారులు ట్రాక్టర్‌ను తహశీల్దార్ కార్యాలయానికి తరలించాలన్నారు. ఇదే అదనుగా భావించిన యాజమాని ట్రాక్టర్‌ని తప్పించాడు. అనంతరం తమ తోటి వారితో అధికారులకు లంచం ఇచ్చి ఆఫీసుకు వెళ్ళకుండా మేనేజ్ చేశానని ఆరోపణలు చేశాడని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఇది తెలియని అధికారులు తమ కార్యాలయానికి వచ్చి చూస్తే ట్రాక్టర్ కనిపించలేదు. స్పంధించిన తహశీల్దార్ ప్రసాద్ ట్రాక్టర్‌ను వెంటనే ఆఫీసుకు తీసుకురావాలని ఆదేశించారు. లేనిచో ప్రభుత్వ పథకాలను కట్ చేస్తామంటూ మండిపడ్డారు. కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరికలు చేశారు. దీనితో చేసేదేమి లేకపోవటంతో ట్రాక్టర్‌ను కార్యాలయానికి తీసుకొచ్చారు. ఇలా అధికారులపై పెద్ద మొత్తంలో లంచాలు ఇచ్చామంటూ ప్రజల్లో తప్పుడు ఆరోపణలు చేస్తున్న కొందరి వ్యవహార శైలితో పలువురు అధికారులు మానసిక క్షోభకు గురి కావాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. గతంలో లాగా పోలీస్ శాఖ అక్రమ ఇసుకపై ఉక్కుపాదం మోపకుండా మెతకవైఖరి అవలంభిస్తున్నారని దీనితోనే ఇసుక అక్రమ రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోతున్నదంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పంధించి మండలంలో అధికారిక ఇసుక ర్యాంపులను ఏర్పాటు చేసి అక్రమార్కులకు చెక్ పెట్టాలని పలువురు కోరుతున్నారు.

# సామినేని హత్య దారుణ ఘటన

**దేశవ్యాప్తంగా సామినేని సంస్మరణ సభలు**
**ఆల్‌ఇండియా కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్**



ప్రజాపక్షం/చింతకాని : సామినేని రామారావు హత్య దారుణ ఘటన అని , దేశ వ్యాప్తంగా సామినేని సంస్మరణ సభలు నిర్వహించనున్నట్లు ఆల్‌ఇండియా కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి , సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు విజ్జు కృష్ణన్ తెలిపారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతుసంఘం ప్రధాన కార్యదర్శి సామినేని రామారావు గత నెల 31న హత్యగావించ బడ్డారు. ఈ సందర్భంగా బుధవారం పాతర్లపాడు గ్రామంలోని సామినేని కుటుంబ సభ్యులను విజ్జు కృష్ణన్ పరామర్శించారు. సామినేని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భార్య స్వరాజ్యం కుమారుడు విజయ్‌కుమార్‌లను పరామర్శించి ఓదార్చారు. సంఘటన జరిగిన తీరును వారిని అడిగి తెలుపుకున్నారు . రామారావు మృధుస్వభావి అని రైతు సమస్యలపై రామారావుతో తాను కలిసి పనిచేశానన్నారు. రామారావు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో రైతు సమస్యలపై సమావేశాల్లో వివరిస్తుంటే తాను ఆశ్చర్యపోయేవాడినన్నారు. ప్రతినిత్యం రైతు సమస్యలపై ఆలోచించేవాడన్నారు. హంతకులను వెంటనే అరెస్ట్ చేయాలని అధికారులను ఆయన డిమాండ్ చేశారు.రామారావు చూపిన దారిలో మనం నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి తీగల సాగర్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు పి జగ్గారెడ్డి, జాయింట్ సెక్రెటరీ మూడ్ శోబన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి రాచబంటి రాము, బోనకల్ మండల కార్యదర్శి కిలారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి రైతుకు కూలీల కొరత..!

**దూర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొస్తున్న రైతులు**



ప్రజాపక్షం/జూలూరుపాడుః ఓ వైపు అతివృష్టితో తెల్ల బంగారం దిగుబడులు తగ్గిపోగా, మరోవైపు కూలీల కొరత రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నది. దీనికి తోడు కూలీ రేట్లు రెండింతలై పత్తి రైతుకు ఆర్థికంగా పెనుభారమైంది. రైతులు పత్తి ఏరించేందుకు దూర ప్రాంతాలైన కల్లూరు, అన్నపురెడ్డి పల్లి, మద్దుకూరు నుంచి ఎక్కువ కూలీ చెల్లిస్తూ కూలీలను ఉదయం వాహనంలో తీసుకొచ్చి సాయంత్రం తిరిగి పంపిస్తున్నారు. ఈసారి తెల్లబంగారం సిరులు కురిపిస్తుందన్న ఆశతో ఎక్కువ మంది రైతులు పత్తి సాగు చేశారు. ఎడతెరిపిలేని వానలతో పూత, కాత రాలిపోగా, కనీసం ఎరువులు వేసే పరిస్థి తి లేకపోవడంతో పంట దిగుబడి తగ్గింది. కొద్ది రోజుల క్రితం వరకు రోజుకు రూ.300 కూలీ ఉండగా ప్రస్తుతం కొరత కారణంగా కేజీ 16 రూపాయలు చెల్లించాల్సి వస్తున్నది. పైగా రైతే వాహనాలను సైతం కూలీలకు ఏర్పాటు చేయాల్సి వస్తుంది. నాలుగేళ్ల క్రితం ఎకరాకు 15 క్వింటాళ్లున్న పత్తి దిగుబడి గతేడాది 10 క్వింటాళ్లకు పడిపోయింది. ప్రస్తుతం 6 క్వింటాళ్లకు చేరుకుందని రైతులు వాపోతున్నారు. పెరిగిన పెట్టుబడి ఖర్చుకు అనుగుణంగా దిగుబడి లేక అన్నదాతలు నష్టపోతున్నారు. ఎకరా సాగుకు విత్తనాలు, కలుపు, ఎరువులు తదితర ఖర్చులు కలిసి రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకు వ్యయమవుతున్నది. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేక పత్తిని ఇంట్లోనే నిల్వ చేస్తున్నట్లు పలువురు రైతులు చెబుతున్నారు.

**ఒక్కో కూలీకి కేజీ 16 చెల్లిస్తున్నా :**
**భూక్యా రాములు చింతల తండా**

8 ఎకరాల్లో పత్తి సాగు చేశా. వర్షాలతో పంట దెబ్బతిన్నది. పూత, కాత సమయంలో రాలిపోయింది. చేతికొచ్చిన పత్తిని ఏరుదామంటే కూలీలు దొరుకుతలేరు. దీంతో చుట్టుపక్కల కూలీలను వాహనాల్లో తీసుకొచ్చి, వీరికి రూ.400 చొప్పున ఐదు రోజులకు చెల్లించాను. దిగుబడి ఎకరాకు 3 క్వింటాళ్లకు పడిపోయింది. మొత్తం రూ. 3 లక్షలకు పైగా ఖర్చు చేసినప్పటికీ దిగుబడి లేక పెట్టుబడి రాలేదు.

# చలికాలం జర పైలం..!

**-కన్నీళ్లు తెప్పించే చన్నీళ్ల స్నానం**
**-చలి ప్రభావంతో మొలకెత్తని వరి నారుమళ్లు**



ప్రజాపక్షం/నేలకొండపల్లి : వారం రోజులు గా వీస్తున్న చలిగాలులు ప్రమాదకరంగా మారాయి. ఉదయం, సాయంత్రం పూట ఇళ్ల నుంచి బయటకు రావాలంటే మనుషులు భయపడుతున్నారు. రోజు రోజు కు కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతుండటం. చలి ప్రభావం తో వరి నారు మళ్లు మొలకెత్తటం లేదు. హస్టల్స్ లో ఉంటున్న విద్యార్థులు చలికి చన్నీటి స్నానం తో అల్లాడిపోతున్నారు. ఖమ్మం ఉమ్మడి జిల్లాలో చలి తీవ్రత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో వృద్ధులకు ప్రమాదకరంగా మారుతుంది. పిల్లల్లో వైరల్ న్యూమోనియా వ్యాపిస్తుంది. దీంతో వృద్ధులు, చిన్నారులు హస్పిటల్ వైపు పరుగులు తీస్తున్నారు. ఖమ్మం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పడిపోయి చలి తీవ్రత అత్యధికంగా ఉంటోంది. దీంతో న్యూమోనియా వ్యాధి ప్రబలి ప్రధానంగా వృద్ధులు , పిల్లలు రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు అస్తమా...బాధితులు దీని బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయిన వైద్యులు చెబుతున్నారు. బ్యాక్టరీయా, వైరస్, పంగల్ ఇన్‌ఫెక్షన్‌లతో శ్వాసకోస రుగ్మత ఏర్పడుతుంది. ఊపిరితిత్తులలోని గాలి సంచులు ద్రవం, చీము, నిండి శ్వాస తీసుకోవటం కష్టంఅవుతుంది. సకాలంలో చికిత్స తీసుకోనట్లయితే ప్రాణాంతకమయ్యే ప్రమాదం ఉంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటే రక్షణ పొందవచ్చునని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థులకు వేడి నీళ్లు లేక చలికి చన్నీళ్లతో సాన్నం చేస్తున్నారు. దీని వలన విద్యార్థులు అనారోగ్యం భారిన పడుతున్నారు. వీరికి ప్రత్యామ్నయంగా వేడి నీళ్ల ను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు. అదే విధంగా యాసంగి సాగు కు నారు పోస్తున్న రైతులు చలికి నారు ఎదుగుదల ఉండదని రైతులకు అవగాహన కల్పించాలి. ఏ సమయంలో నారుమళ్లను పోయాలిఅనే విషయాల పై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఉంది.



**ఇవి పాటించాలి...**

చిన్న పిల్లలు వెచ్చగా ఉండటానికి స్వెట్టర్లు వేసి, చెవులకు టోపీ పెట్టాలి. కాళ్ల కు చేతులకు సాక్స్ గ్లవ్స్ పెట్టాలి. పాలు తాగే శిశువులను తల్లి పొత్తిళ్లలలో పడకోబెడితే వేచ్చగా ఉంటారు. ఉదయం ఎండలో కొద్ది సేపు ఉంచితే జలుబు, శ్వాస సంబధిత వ్యాదుల నుంచి ఉపశమనం లభిస్తుంది. వృద్ధులు పిల్లలు, అస్తమా బాధితులు తెల్లవారు జామున ప్రయాణాలు చేయకుండా ఉంటే మేలు. బయటకు వెళ్తే స్వెట్టర్లు రగ్గు వేసుకుని చెవులకు రుమాలు చుట్టుకోవాలి. గాలి పీల్చినప్పుడు ముక్కులోకి దుమ్ము వెళ్లకుండా మాస్క్ ధరించాలి.

**గ్రామాల్లో జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తాం :**
**యం.యర్రయ్య, ఎంపీడీఓ, నేలకొండపల్లి.**



పెరుగుతున్న చలి వలన జరిగే అనర్థాల పై ప్రజలను అప్రమతం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇస్తాం. వసతి గృహం లో విద్యార్థుల కు దుప్పట్లు విషయంపై జిల్లా అధికారులకు వివరిస్తాం. వారికి కూడ చలి నుంచి రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకుంటాం.

**సకాలంలో వైద్యులను సంప్రదించాలి :**
**డాక్టర్.కె.రాజేష్, వైద్యాధికారి, నేలకొండపల్లి.**



చలికాలం శ్వాసకోస ఇబ్బంది గా ఉంటే వెంటనే స్తానిక వైద్యులను సంప్రదించాలి. పిల్లలో, వృద్దులు లో సమస్య తీవ్రంగా ఉంటుంది. ఎట్టి పరిస్థితులలో నిర్లక్ష్యం చేయవద్దు. తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**క్షేత్ర స్థాయిలో సదస్సులు నిర్వహించాలి :**
**పసుమర్తి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త, నేలకొండపల్లి.**



చలి తీవ్రత వలన కలిగే నష్టాల పై ప్రజలకు వివరించేందుకు క్షేత్ర స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలి. వైద్య శాఖ గ్రామాల వారీ గా ప్రత్యేక వైద్య శిభిరాలు నిర్వహించి పిల్లలకు, వృద్దులకు అవసమైన వైద్య సేవలు అందించాలి.

## కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

**-సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో**
**నవంబర్26 దేశవ్యాప్త ప్రదర్శనలు**
**-అఖిల భారత కిసాన్ సభ**
**జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజ్జుకృష్ణన్**



ప్రజాపక్షం/వైరాః కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజ్జుకృష్ణన్ అన్నారు. బుధవారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని లాలాపురం గ్రామంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విధానాల వ్యవసాయ రంగంలో సంక్షోభంపై చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో విజ్జుకృష్ణన్ ప్రసంగించారు. వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడం వలన సాగుకు రైతులు దూరమవుతున్న పరిస్థితి నెలకొందని అన్నారు. పంట పండిస్తున్న రైతుకు కొన్ని సందర్భాల్లో కెజి ఉల్లిపాయలు, టమాటాలు, ఎల్లిపాయలకు ఒక రూపాయలు ధర వస్తే వినియోగదారులకు కంపెనీలు కెజి రూ.100లకు విక్రయం చేస్తూ లాభాలు పొందుతున్నాయని అన్నారు. నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులతో లొంగిపోయి పత్తి దిగుమతి సుంకం లేకుండా దిగుమతి చేసుకుంటూ మన దేశ రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలకు రూ.8110లు కూడా పొందకుండా అన్యాయం చేస్తుందని అన్నారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా రైతులకు కేంద్ర ప్రభుత్వం వ్రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్26న దేశవ్యాప్త ప్రదర్శనలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతు సంఘః రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, 8రకాల పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి నేడు కేవలం సన్న ధాన్యంకు మాత్రమే బోనస్ ఇస్తుందని, అది కూడా రబీ సీజన్‌లో వరి సన్న ధాన్యం బోనస్ రైతులకు జమ చేయలేదని అన్నారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2025 విద్యుత్ సంస్కరణల బిల్లు విద్యుత్ సరఫరా వ్యవస్థను ప్రైవేటీకరణ వైపు అడుగులు వేసేందుకు సిద్ధమవుతుందని, దీని ద్వారా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ద్వారా ఉచిత విద్యుత్ రద్దు అవుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం రైతాంగానికి విద్యుత్ సంస్కరణ అత్యంత ప్రమాదకరమని అన్నారు. సమస్యలు పరిష్కారం కోసం ఐక్య రైతు ఉద్యమమే మార్గం అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జంగారెడ్డి, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా వీరభద్రం, రైతు సంఘం రాష్ట్ర కమిటి ఈసభ్యులు షేక్ మీరా, వాసిరెడ్డి ప్రసాద్, రాయల వెంకటేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్ళపల్లి కృష్ణ, రైతు మహిళా కోకన్వీనర్ బొంతు సమత, గుడారి ఉమా, రైతు సంఘం జిల్లా నాయకులు దొడ్డపనేని కృష్ణార్జునరావు, మల్లెంపాటి రామారావు, కొప్పుల కృష్ణయ్య, మేడా శరాబంది, సంక్రాంతి నర్సయ్య, సంక్రాంతి పురుషోత్తం, సంక్రాంతి చంద్రశేఖర్, దొండపాటి నాగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, తుళ్లూరు రమేష ప్రతాపనేని వెంకటేశ్వరరావు, సిఐటియు నాయకులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, చెరుకుమల్లి కుటుంబరావు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్ నాగుల్‌పాషాతో పాటు వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

## టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

ప్రజాపక్షం/అశ్వాపురం: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టిపిటిఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని గొందిగూడెం ఆశ్రమ పాఠశాలలో మండల అధ్యక్షుడు క్రాంతి కిరణ్, మండల ప్రధాన కార్యదర్శి పి కృష్ణయ్య ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలోని ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్, బదిలీలు, ప్రమోషన్లు, అఫ్ గ్రెడేషన్, పీఎఫ్ అకౌంట్లు కేటాయించడం తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 24న ఐటీడీఏ జిల్లా కలెక్టర్, వచ్చే నెల 12న కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతామని అన్నారు. ఈకార్యక్రమంలో టిపిటిఎఫ్ సభ్యులు, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి



ప్రజాపక్షం/కారేపల్లి: పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, ఈనెల 13న ఖమ్మం కలెక్టరేట్ ముందు జరిగే ధర్నా ప్రదర్శనను జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ అన్నారు. బుధవారం మండలంలోని జవాన్లపల్లిలో గ్రామంలో నేడు జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం వ్యవసాయ సీజన్ ప్రారంభం నుండి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం మూలంగా సకాలంలో గంటలకు ఎరువులు యూరియా అందక అలాగే అతివృష్టి ప్రకృతి వైపరీత్యాల మూలంగా గత నెల చివరలో వచ్చిన భారీ మొంథా తుఫాను మూలంగా పత్తి వరి మిర్చి మొక్కజొన్న ఇతర అపరాల పంటలు భారీగా దెబ్బతిని చేతికి వచ్చిన అన్ని రకాల పంటలు తడిసి మొలకలు వచ్చి మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక రైతాంగం మొత్తం దిక్కుతోచని పరిస్థితిలో ఉందన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా ఇంత వరకు తుఫాన్ సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకెఎంఎస్ మండల నాయకులు రాంబాబు, బాటయ్య, వెంకన్న, లక్ష్మి , బుజ్జమ్మ, రాంబాయి పాల్గొన్నారు.

## హామీల అమలులో చిత్తశుద్ధి లేదు



ప్రజాపక్షం/కారేపల్లి: ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయడం లేదని, మోడీ విధానాలతో దేశంలో మహిళల హక్కులు రోజు రోజుకు హరించుకపోతున్నాయని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ, కొండబోయిన ఉమావతి ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఈనెల 25 నుండి 28వ తేదీ వరకు జరగనున్న ఐద్వా జాతీయ మహాసభను విజయవంతం చేయాలని బుధవారం మాణిక్యారం గ్రామంలో కరపట్టి సీతమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మహిళ రక్షణకు చట్టాలు ఉన్నా అగంతులకు పాలకులు కొమ్ముకాస్తుండటంతో మహిళలకు రక్షణ కరువైందన్నారు. చట్ట సభలలో మహిళలకు రిజర్వేషన్ బిల్లుపై వామపక్షాలు మినహా మిగతా పార్టీలకు చిత్తశుద్ధి లేదన్నారు. బాలికలపై హింస పెరిగిందని, మహిళల అశ్లీల చిత్రీకరణ నిరోధం, మహిళా భద్రతకు కఠినమైన చర్యలు తేవాలని డిమాండ్ చేశారు. మొదటి సారి తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ఐద్వా జాతీయ మహాసభలకు జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు టీచర్, దావలె, కోశాధికారి ఎస్ పుణ్యవతి, ఉపాధ్యక్షురాలు సుధాసుందరరామన్ వంటి జాతీయ నాయకులు హాజరవుతారన్నారు. మహాసభల విజయవంతానికి ప్రతి ఒక్కరు పాటుపడాలని కోరారు. ఈకార్యక్రమంలో పాయం వరలక్ష్మీ , కరపటి శాంతమ్మ, చల్ల మల్లమ్మ, ఈసాల కళావతి, స్వరూప, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## దేశ ప్రగతికి యువతే ప్రాణం




ప్రజాపక్షం/కారేపల్లి: భారతదేశ అభివృద్ధికి, దేశ ప్రగతికి యువతే ప్రాణమని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌కే నాగుల్ పాషా అన్నారు. డివైఎఫ్ఐ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కారేపల్లి సినిమాలు సెంటర్‌లో ఏర్పాటు చేసిన నూతన జండా దిమ్మెను డివైఎఫ్: మండల కార్యదర్శి ఆదేర్ల వినయ్ కుమార్ ఆవిష్కరించి, ఆయన అధ్యక్షతన వహించిన సభలో ఎస్‌కే నాగుల్ పాషా మాట్లాడుతూ కులము మతము ప్రాంతము అనే బేధం లేకుండా యువతీ యువకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై 1980వ సంవత్సరంలో డివైఎఫ్ఐ ఏర్పడిందని, విప్లవ వీరులు స్వాతంత్ర పోరాట యోధులు చేగువేరా భగత్‌సింగ్ ఆశయాల సాధనే లక్ష్యంగా ఏర్పడిన నాటి నుండి విద్యా ఉపాధి కోసం పోరాడుతుందని తెలిపారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలపై డివైఎఫ్ఐ పోరాడుతుందని యువత అందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమంలో డివైఎఫ్: రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్తెనపల్లి నరేష్, కొర్లపాటి రాజేష్, మిట్టగనుపుల సాంబ, గజ్జల సంపత్, ఆదేర్ల నాగరాజు, ఎస్‌కే సలీం, వాడపల్లి ఉపేందర్, కాకాటి పృధ్వీ, కాకాటి సాయి, హరి నాయక్, అహ్మద్ పాషా, శ్రీధర్, ఎన్ నరేష్, రావుల వెంకటేష్, తుమ్మల నాగేశ్వరరావు, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు క్రమశిక్షణ తప్పనిసరి

**- పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య**
**- వెంకటగిరి పాఠశాలకు 30 కుర్చీలు వితరణ**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన పాటించడం ద్వారా స్వీయనియంత్రణ పెంపొంది ఉన్నత లక్ష్యాలను సాధించడానికి దోహదపడుతుందని, పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య అన్నారు. బుధవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని పెద్ద వెంకటగిరి ప్రభుత్వ పాఠశాలకు ట్రస్ట్ ద్వారా 30 కుర్చీలను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు...విద్యార్థి దశ ఎంతో కీలకమైనదని, ఇక్కడ మనం తీసుకునే నిర్ణయాలే రేపటి భవిష్యత్‌ను నిర్దేషిస్తాయన్నారు. కావున విద్యార్థులు నియమాలను పాటిస్తూ గురువులు భోధించే పాఠాలను శ్రద్ధగా వినాలన్నారు. అలాగే విధిగా హోంవర్క్ చేయడం, పెద్దలను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. ఇవి వ్యక్తి ఎదుగుదలకు ఎంతో కృషి చేస్తాయన్నారు. ఈ సందర్భంగా కుర్చీలను బహుకరించిన పరిశ పుల్లయ్యను పాఠశాల ఆధ్వర్యంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు బి.కోట్యా, పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీదేవి, ఉపాధ్యాయులు సువర్ణ ప్రసాద్, వీరబాబు, రమణ, రమేష్, కృష్ణకుమారి, రవికిషోర్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలను నివారించాలి

**మరమ్మతులు చేపట్టాలి : షేక్ లాల్‌మహ్మద్**



**ప్రజాపక్షం/వైరా:** వైరా రింగు రోడ్డు ప్రాంతాల్లో జరిగే ప్రమాదాలను నివారించేందుకు అధికారులు చర్యలు చేపట్టే గుంటలను పూడ్చివేయాలని మాజీ జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ లాల్‌మహ్మద్ అన్నారు. బుధవారం లాల్‌మహ్మద్ మాట్లాడుతూ వైరా రింగు రోడ్డు వద్ద తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రమాదాల నివారణ కోసం అధికారులు రింగు రోడ్డు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ట్రాఫిక్ పోలీసులు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గతంలో వైరా బస్టాండ్ నుండి బస్సులు నాలుగు వైపులా పోయే విధంగా కేసులు బాటు ఉండేదని, ప్రస్తుతం బస్టాండ్ వెనక భాగం రెండువైపులా మూసివేయడంతో బస్సులు రింగు రోడ్డు వైపే తిరిగి రావడం జరుగుతుందని, దీంతో తరచుగా వాహనాల రద్దీ పెరగడంతో రింగు రోడ్డు వద్ద సరైన సూచిక లేకపోవడమే ప్రమాదాల కారణమని, దీని నివారణకు చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. వైరా రింగు రోడ్డు వద్ద త్వరగా రింగు రోడ్డు ఏర్పాటు చేసేందుకు పూర్తి ఏర్పాటు ఏసి రింగును వాడుకలోకి తీసుకొస్తే ప్రమాదాలు నివారణ చేయవచ్చునని ఆయన అన్నారు. అధికారులు స్థానిక రింగు రోడ్డు వద్ద ప్రమాదాలు జరగకుండా చూడటంతో పాటు రోడ్లపై ఏర్పడిన గుంటలో కూడా పూడ్చాలని కోరారు. గుంటలో రోడ్లపై ఏర్పడటం వలన ద్విచక్ర వాహనదారులు తీవ్ర ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన తెలిపారు.

# ఇంజనీర్ ఉద్యోగాలకు ఎంపికైన సాయిస్ఫూర్తి విద్యార్థులు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని గంగారంలో గల సాయి స్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినీలు ఇన్ఫోసిస్ లిమిటెడ్ వారి రిక్రూట్మెంట్ డ్రైవ్ లో సాఫ్ట్ వెర్ సిస్టం ఇంజనీర్ (ట్రైనీ) ఉద్యోగాలకు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సియస్ఈ) కంప్యూటర్ సైన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (సి యస్ యం)కు 04 గురు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్ మెంట్ ఆఫీసర్ డా.డియన్ వి.కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్ఫోసిస్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు జాతీయస్థాయిలో ఇంటర్వ్యూలు నిర్వహించారని, ఈ ఇంటర్వ్యూలకు కళాశాల నుంచి 52మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఈ ఇంటర్వ్యూలు రాతపరీక్ష, టెక్నికల్ రౌండ్, హెచ్ ఆర్ రౌండ్, మౌఖిక ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేసి సిస్టం ఇంజనీర్ (ట్రైనీ)ఇంజనీర్లుగా 04మందిని ఎంపిక చేశారన్నారు. అదేవిధంగా ట్రైనీ ఇంజనీర్లుగా కేటగిరిలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సియస్ఈ) విభాగం నుంచి ఇద్దరు, కంప్యూటర్ సైన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (సియస్యం) విభాగం నుంచి ఇద్దరు ఉద్యోగాలు పొందినట్లు కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డా. వూటుకూరి శేషారత్నకుమారిలు తెలిపారు. జాతీయస్థాయిలో జరిగిన ఇంటర్వ్యూలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో దాదాపు 562 విద్యార్థినీ,విద్యార్థులు ఇంటర్వ్యూ లకు హాజరవ్వగా సాయిస్ఫూర్తి విద్యార్థినీలు మాత్రమే ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థినీలు బెంగళూరు,హైదరాబాద్ లలో ఉద్యోగం చేయవలసి ఉంటుందని, వీరికి జీతం సంవత్సరానికి రూ.3.6 లక్షలు కంపెని అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్దినులను ప్రముఖ పారిశ్రామికవేత్త, విద్యాధికులు, హెటిరో ఫార్మాస్యూటికల్ కంపెనీ అధినేత, రాజ్యసభ సభ్యులు, సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డా. బండి.పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విదలు వర్చువల్ గా అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కళాశాల వైస్ ప్రిన్సిపాల్, సియస్ఈ విభాగాధిపతి డా. షేక్.యాకూబ్, కళాశాల ఏఐ అండ్ యంయల్, ఏఐ అండ్ డియస్ విభాగాధిపతి డా.తోటకూర వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో వెటర్నరీ ఉద్యోగి మృతి



**ప్రజాపక్షం/కూసుమంచి:** మం డల కేంద్రంలోని పశు ఆసుపత్రిలో ఉద్యోగిగా పని చేస్తున్న నరేంద్ర గుండెపోటుతో మృతి చెందిన సంఘటన బుధవారం తాళ్ళగడ్డ తండాలో చోటు చేసుకుంది. రాజుపేట బజార్ పంచాయితీ తాళ్ళ గడ్డ తండాకు చెంది న ఓ రైతు తన పశువు డీలవరీ కోసం పశువైద్యులకు ఫోన్ చేయగా తక్షణమే స్పందించిన నరేంద్ర ఆ గ్రామానికి వెళ్ళి పశువుకు వైద్యం చేస్తుండగా గుండె పోటు వచ్చి అక్కడిక్కడే కిందపడిపోయాడు. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** వరి రైతులు వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకెపి సొసైటీ కేంద్రాల వద్దనే వరి ధాన్యాన్ని విక్రయించుకోవాలని మద్దులపల్లి మార్కెట్ డైరెక్టర్ జడల నాగేష్‌గౌడ్ అన్నారు. బుధవారం ఐకెపి ఆధ్వర్యంలో పాతర్లపాడు, జల్లేపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కేంద్రాలు ప్రారంభించిన సందర్భంగా పాతర్లపాడు గ్రామంలో ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతులు ఆరుగాలం పండించిన పంటలను దళారులకు అమ్మి మోసపోవద్దని ఉద్దేశ్యంతో సిసిఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పత్తి, ఐకెపి సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సన్న వరి ధాన్యానికి మద్దతు ప్రకటించి కొనుగోలు చేస్తున్నారని, రైతులు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యాన్ని విక్రయించుకోవచ్చునని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం కలకోట సంపత్‌కుమార్, సిసి రాములమ్మ, గ్రామ పెద్దలు పోట్ల కిరణ్, జడల రమేష్, ఆర్ వెంకటరెడ్డి, జిపిఓ దీవెన, దడిదల వెంకన్న, దివ్య శ్రీనివాస్, అశోక్, నరేష్, కాడబోయిన శైలజ, మౌనిక, విఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని ఏదులాపురం,వరంగల్‌క్రాస్‌రోడ్డుకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ నుంచి ముంజూరైన చెక్కులను స్థానిక సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి బుధవారం అందజేశారు. ఐదు చెక్కులకు గాను బియ్యాల లింగరాజు రూ.60వేలు, పసుపులేటి నాగమణి రూ.60వేలు, మొహ్మద్ మహబూబ్ రూ.30వేలు, తోట నరసింహారావు రూ.55వేలు, సూత్రపు సుజాతకు రూ.22వేల500వందలు అనారోగ్య ఖర్చుల నిమిత్తం మంజూరయ్యాయి. ఈ చెక్కులను సదరు లబ్ధిదారులు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సాకారంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సిఫారస్‌తో లభించాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, మున్సిపాలిటీ నాయకులు దండి రంగారావు, వెన్నం భాస్కర్, వెంపటి రాము, లగిశెట్టి రమేష్, రజబెల్లి, పాల్వాయి యోబు, యూసఫ్(హన్నే), యువజన సంఘం సభ్యులు మిరియాల నరుణ్‌తేజ్, ప్రభాకర్, చింతల ఉదయ్, వెన్నం రిషి, సిపిఐ సోషల్‌మీడియా ఇంచార్జ్ రెబ్బగొండ్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు రానివ్వద్దు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** అధికారులు పత్తి కొనుగోలులో రైతులకు ఇబ్బందులు రానివ్వద్దని రాష్ట్రమార్కెటింగ్ శాఖ సంచాలకురాలు లక్ష్మి బాయి అన్నారు. బుధవారం ఖమ్మంరూరల్ మండలంలోని తల్లంపాడు బాలజీ జిన్నింగ్‌మిల్, పొన్నెకల్లులోని సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పత్తి కొనుగోలు ప్రక్రియ, ట్యాబ్, ఎంట్రీ గేట్ ఎంట్రీ పాస్, పంట నమోదును పరిశీలించారు. క్రయ,విక్రయాలలో ఏర్పడుతున్న సమస్యలను గురించి అధికారులతో చర్చించారు. కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను అధికారులకు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ...ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు వచ్చిన రైతులను నిరాశకు గురి చేయకుండా కొనుగోలు చేయాలని సెంటర్ల నిర్వాహకులకు సూచించారు. రైతులు 12శాతం తేమశాతం ఉండేలా ఇంటి వద్ద ఎండబెట్టుకుని తీసుకురావాలన్నారు. దళారులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలలో పత్తిని విక్రయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ పురం రవికుమార్, జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాసరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, సిసిఐ బయ్యర్ వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

# చేప పిల్లలు పంపిణీ చేసిన అధికారులు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం పరిధిలోని చెన్నూరు, పెద్ద కోరుకొండి తదితర గ్రామాలలో 11 చెరువులలో బుధవారం చేప పిల్లలను చెరువులో వదిలారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ మత్స్య సహకార సంఘం సభ్యులు చేపలు పెంపకం ద్వారా కుటుంబాలు ఆర్థికంగా బలపడాలని ప్రభుత్వం వారికి అనేక సంక్షేమ పథకాలను అందిస్తుందని వాటి ద్వారా చేయూతను పొంది కుటుంబాలు అభివృద్ధి పొందాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రాజారావు, ఎస్ఎస్పి లక్ష్మి లతోపాటు చేపల సొసైటీ సంఘ జిల్లా మాజీ అధ్యక్షులు మర్సకట్ల బాలరాజు, రామోజీ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో జిల్లాస్థాయి క్రీడలు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం రెబ్బవరం గ్రామంలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఖమ్మం జిల్లాస్థాయిలో బుధవారం అండర్14, అండర్ 19, జిల్లాస్థాయి గేమ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ గేమ్స్ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా గేమ్ క్రీడల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధికారెడ్డితో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విలేకరి కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని లింగాల గ్రామంలో ఓ దినపత్రికలో పనిచేస్తూ అనారోగ్యంతో గత రెండు నెలలు క్రితం మృతిచెందిన వేము మోహన్ (40) కుటుంబాన్ని ఆదుకునేందుకు విలేకరుల మిత్ర బృందం ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, వ్యాపారస్తులు వద్ద విరాళాలను సేకరించి రూ. లక్ష రూపాయలను చెక్కును బుధవారం మోహన్ బాబు భార్య రాజకుమారి, కుమార్తె మధుర పేరుపై జాయింట్ ఖాతాతో ఎస్బిఐలో ఫిక్స్ 10 సంవత్సరాలు పాటు చేసి నగదు చెక్కును వారి కుటుంబానికి విలేకరుల బృందం బుధవారం అందజేశారు. రాబోయే రోజుల్లో మోహన్ బాబు కుటుంబానికి అండగా ఉంటామని, సుమారుగా ఐదు సంవత్సరాలు పాటు మండలంలో విలేఖరిగా పనిచేస్తూ పలువురు మన్ననలుపొంది అతి తక్కువ కాలంలో మరణించడంతో తీరని లోటు అని వారి మోహన్ బాబు గత స్మృతులను స్మరించుకుంటూ, ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ మౌనం పాటిస్తూ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో విలేకరుల బృందం అబ్దుల్ మున్నా, ధర్నాసి బాలరాజు, వేము రాంబాబు, ఉబ్బన బాబురావు, నరేష్, పుల్లయ్య, సురేష్, శంకర్, సాంబ, సిపిఐ మండల కార్యదర్శి దయాకర్ రావు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌లో భగ్గుమన్న వర్గ విబేధాలు..!





**- పదవులు పెట్టిన చిచ్చు**

**ప్రజాపక్షం/పాల్వంచ :** రెండు సంవత్సరాల క్రితం రేవంత్‌రెడ్డి రూపంలో బిఆర్ఎస్ పార్టీ అధికారానికి దూరమయింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. పార్లమెంట్ ఎన్నికలలో ఒక్క సీటు కూడా సాధించకుండా బిఆర్ఎస్ చతికిల పడింది. అప్పటి నుండి అధ్యక్షుడు కేసిఆర్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. రెండు సార్లు అసెంబ్లీకి, ఓ సారి వరంగల్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు. కేసిఆర్ మానస పుత్రిక లక్ష కోట్లతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం కుంగుబాటుతో ఆ పార్టీ నగుబాటుకు గురైనది. ఫోన్ ట్యాపింగ్‌తో అందరి చూపు యువ నాయకుడి వైపు చూస్తున్నాయి. కార్ రేసింగ్‌తో కోట్ల అవినీతి వెలుగులోకి వచ్చింది. లిక్కర్ దందా కేసిఆర్ కుమార్తె కవిత మెడకు చుట్టుకొంది. దీనితో ఆమె జైలుకు వెళ్ళింది. అప్పటి నుండి పార్టీ పరిస్థితి అగమ్య గోచరంగా తయారైనది. పరిస్థితుల ప్రభావంతో కవితను పార్టీ నుండి సస్పెండ్ చేశారు. దీనితో కవిత తీవ్ర స్థాయిలో స్పంధించారు. కేటిఆర్. హరీష్‌రావులపై పలు ఆరోపణలు చేశారు. హరీష్‌రావు మాటలతో నన్ను సస్పెండ్ చేశారని మండిపడ్డారు. చాపకింద నీరులా ఆ పార్టీకి వ్యతిరేకంగా, తన తండ్రి కేసిఆర్‌కు అనుకూలంగా మాట్లాడుతూ అవకాశం దొరికినపుడల్లా , మాజీ మంత్రి హరీష్‌రావు పెద్ద ఎత్తున అవినీతి పాల్పడ్డారంటూ ఆరోపణలు గుప్పిస్తున్నారు. పార్టీని ఇరుకన పడేస్తున్నది.దీనితో మింగలేక కక్కలేక కేసిఆర్ ఫాం హౌజ్‌కే పరిమితమవుతున్నారు. పదేండ్లు అధికారంలో ఓ వెలుగు వెలిగిన జిల్లా బిఆర్ఎస్ పార్టీలో వర్గ విభేధాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. నామినేటెడ్ పదవులు చిచ్చుపెట్టాయి. జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు తీరుతో నాయకులు విబేధించారు. ఆయన ఒంటెద్దు పోకడలపై మండి పడ్డారు. పంచిన పదవులపై భగ్గుమన్నారు. కొత్తగూడెం, ఇల్లందు నియోజక వర్గాలలో జిల్లా అధ్యక్షుడిపై తిరుబాటు జెండా ఎగురవేశారు. సీనియర్ నాయకులు మాజీ ఎంఎల్ఎ వనమా వెంకటేశ్వరరావుకు కనీసం సమాచారం ఇవ్వకుండా కొత్తగూడెం నియోజకవర్గం చుంచుపల్లి, సుజాతనగర్ మండలాలకు బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులను జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు నియమించి ప్రకటించారు. దీనితో వనమా ఖంగుతిన్నారు. ఏకపక్ష నిర్ణయమంటూ మండిపడ్డారు. పార్టీలో చీలికలను ప్రోత్సహించకూడం టూహితవు పలికారు. వర్గాలను ప్రోత్సహించకూడదన్నారు. గ్రూపు రాజకీయాలకు స్వస్తి చెప్పాలన్నారు. ఇంచార్జి తనకు తెలికుండా పార్టీ మండల అధ్యక్షులను నియమించటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. విషయం పార్టీ అధిష్టానానికి తెలియజేస్తానంటూ ప్రకటన విడుదల చేశారు. రేగా కాంతారావు ప్రకటించిన కమిటీలను రద్దు చేయించి తిరిగి నూతన కమిటీలను వేస్తామన్నారు. అలాగే ఇల్లందు మాజీ ఎంఎల్ఎ హరిప్రియకు తెలియకుండా బిఆర్ఎస్ ఇల్లందు పట్టణ అధ్యక్షుడిగా ఎండి. అబ్దుల్ జబ్బార్‌ను రేగా కాంతారావు నియమించారు. ఈ పరిణామాన్ని జీర్ణించుకోని మాజీ ఎంఎల్ఎ హరిప్రియా నాయక్ రాష్ట్ర పార్టీ ఆదేశాల మెరకంటూ ఉద్యమకారుడు సీనియర్ నాయకులు సిలివేరు సత్యనారాయణను నియమిస్తూ మరో ప్రకటనను విడుదల చేశారు. దీనితో జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుపై ధిక్కార స్వరం వినిపించారు. స్థబ్దుగా ఉన్న వర్గపోరు ఒక్కసారిగా ఉబికి వచ్చింది. బట్ట బయలైనది. అధికారం లేకపోయిన పార్టీ నుండి మెజారిటీ క్యాడర్ ఇతర పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు. ఉన్న క్యాడర్‌లో వర్గ విబేధాలు గందరగోళంలో పడేస్తున్నాయనటంలో ఎలాంటి సందేహం లేదని పలువురు అంటున్నారు. బిఆర్ఎస్ వర్గ పోరులో ఎవరు నెగ్గుతారో ఎవరు తగ్గుతారో వేచి చూడాలి.

# పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల కేంద్రంలోని జూలూరుపాడు పోలీస్ స్టేషన్, సిఐ కార్యాలయాన్ని బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో లోని ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ అబ్దుల్ రెహమాన్, జూలూరుపాడు సీఐ శ్రీ లక్ష్మి , ఎస్సై రవి, సిబ్బంది పాల్గొన్నారు.

# అండర్ 17 రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన ఎంజెపి కూసుమంచి విద్యార్థులు



**ప్రజాపక్షం/కూసుమంచి:** ఈనెల 11వ తారీఖున ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన అండర్ 17 ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ పోటీలలో మహాత్మ జ్యోతిబా పూలె కూసుమంచి గురుకుల విద్యార్థి జి అశోక్ 10వ తరగతి 800 మీటర్ల పరుగుపందెంలో 2వ స్థానం, బి జశ్వంత్ 9వ తరగతి 3కిమీ పరుగు పందెంలో 2వ స్థానం సాధించి ఈనెల 14న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. క్రీడాకారులను ఉమ్మడి జిల్లా బిసి గురుకులాల ఆర్సిఒ సిహెచ్ రాంబాబు, పాఠశాల ప్రిన్సిపల్ పేరబోయిన మల్లయ్య, ఏటిపి బి వెంకటేశ్వర్లు, డిప్యూటీ వార్డెన్ సిహెచ్ వెంకట నర్సయ్య, పిఈటి బి నర్సింహా, పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

# గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ఏన్కూరు :** గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి దశల వారి పోరాటాలు నిర్వహిస్తున్నామని టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగలరావు, జిల్లా కార్యదర్శి గరిక శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలం లోని మూల పోచారం ఆశ్రమ పాఠశాల, ఏన్కూరు గురుకుల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, సంఘ పిలుపు మేరకు రాష్ట్రస్థాయిలో మూడు దశల్లో పోరాటాలను నిర్వహిస్తున్నామని అందుకు ఉపాధ్యాయులందరూ పోరాటాల్లో పాల్గొనాలని కోరారు. పండిట్స్, పిఈటి పోస్టులను అప్గ్రేడ్ చేసి, వెంటనే ప్రమోషన్ లు ఇవ్వాలి కోరారు. కన్వర్టెడ్ పాఠశాలకు పోస్టులు మంజూరు చేయాలని, సిఆర్టి ఉపాధ్యాయులనకు రెగ్యులర్ వేతనాలు ఇవ్వాలని అన్నారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు కామన్ సీనియార్టీ ప్రకారంగా డబ్ల్యూహెచ్ఓ, ఏటిడిఓ, డిటిడిఓ, డిప్యూటీ డైరెక్టర్ (టిడబ్ల్యూ)గా ప్రమోషన్లకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. 317 ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి అర్ధాంతరంగా ఆగిపోయిన పీజీ హెడ్ మాస్టర్ ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలన్నారు. ప్రత్యేక టిఆర్టి ని నిర్వహించి, కాళీ ఉపాధ్యాయ పోస్టులను నింపాలని కోరారు. డైలీ వేసి వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు భూక్య భాస్కర్ రావు, పాయం శ్రీనివాసరావు, తాళ్లూరి వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల విక్రయాలను పిఓఎస్ మిషన్ ద్వారా మాత్రమే చేయాలి



**ప్రజాపక్షం/కూసుమంచి:** ఎరువుల విక్రయాలను పిఓఎస్ మిషన్ ద్వారా మాత్రమే చేయాలని కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సతీష్ అన్నారు. బుధవారం కూసుమంచి రైతు వేదికలో ఆయన డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగి ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని డీలర్లకు సూచించారు. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలకు సంబంధించి స్టాక్ రిజిస్టర్‌లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని, డీలర్లు తప్పని సరిగా లైసెన్స్‌ను ప్రదర్శించాలని, స్టాక్ బోర్డ్‌ను ధరల పట్టికను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు. ఓ ఫార్మ్స్ పీసీలు తప్పని సరిగా లైసెన్స్‌లో పొందుపరచాలని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, డీలర్లు పాల్గొన్నారు.

# తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తపాలా శాఖ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్ సూపరింటెంట్ వీ.వీరభద్రస్వామి సూచించారు. మండలం లోని చెరువుమాధారం, నేలకొండపల్లి తపాలా కార్యాలయాలను బుధవారం ఆకస్మికంగా తనీఖీ చేశారు. చెరువుమాధారంలో తపాలా శాఖ కు కేటాయించిన స్థలం ను పరిశీలించారు. స్థలం ను మ్యూటేషన్ చేసే పనుల ప్రక్రియను వేగవంతం గా చేపట్టాలని ఆదేశించారు. పలు రికార్డులను తనీఖీ చేశారు. వినియోగదారులతో మాట్లాడారు...తపాలా సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు...ఖమ్మం ఉమ్మడి జిల్లాలో తపాలా శాఖ కు సంబంధించిన స్థలాలను మ్యూటేషన్ చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో సుజాతనగర్, దుమ్ముగూడెంచెరువుమాదారం గ్రామాలలో శాఖ కు సంబంధించిన స్థలాలు ఉన్నట్లు తెలిపారు. వీటిని ముందుగా తపాలా శాఖ పరిధిలోకి తీసుకున్న తరువాత శాఖ భవనాలు నిర్మించే ప్రక్రియ ను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. తపాలా శాఖ అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

# బాలల్లో సృజనాత్మక శక్తి వెలుగులోకి వస్తుంది



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పోటీల వలన బాలలలో దాగి ఉన్న సృజన్మాతక శక్తి వెలుగులోకి వస్తుందని నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో భక్తరామదాసు సర్వీస్ సోసైటీ వారి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం ను పురష్కరించుకుని విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. బాలలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. పాటలు, నృత్యాలు ఇతరత్రా పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు బాల్యం నుంచే చదువుతో పాటు, క్రీడలలో రాణించేలా తయారు చేయాలని సూచించారు. చాచా నెహ్రూ యెక్క గొప్పతనం ను వివరించారు. ఈ కార్యక్రమంలో పాలడుగు పూర్ణచందర్ ప్రసాద్, షేక్ బాసింసాహెబ్ చిన్న కృష్ణ, భువనాసి దుర్గారావు సోసైటి ప్రతినిధులు పాల్గొన్నారు.

# గిరిజన జోనల్ స్థాయి క్రీడలకు ఏర్పాట్లు పూర్తి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఈనెల 18 నుండి రెండు రోజుల పాటు కిన్నెరసానిలో నిర్వహించనున్న గిరిజన జోనల్ స్థాయి క్రీడలకు ఏర్పాట్లు పూర్తయినట్లు ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా క్రీడాధికారి గోపాలరావు అన్నారు. పాల్వంచ మండప పరిధిలోని కిన్నెరసాని క్రీడా పాఠశాల ప్రాంగణంలోని మైధానాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలీబాల్, కబడ్డి, ఖోఖో, టెన్నికాయిట్, ఆర్చరీ మైధానాలను క్రీడలకు అనువుగా సిద్ధం చేశారు. ఈ క్రీడల్లో మెరుగైన ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను డిసెంబర్ 3,4,5 తేదీల్లో ఐటిడిఏ ఏటూరునాగం పరిధిలో జరగనున్న రాష్ట్రస్థాయి గిరిజన క్రీడల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓలు కొమరం వెంకటనారాయణ, సోయం నాగేశ్వరరావు, బండా రాంబాబు, ప్రధానోపాధ్యాయులు చందు, పిడి లు బాలసుబ్రహ్మణ్యం, పి రాంబాబు, బి గోపాలరావు, మోతిలాల్, ముత్తయ్య, వీరభద్రం, అంజి, కోచ్‌లు వాసు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటిన మౌనశ్రీ



**ప్రజాపక్షం/ఏన్కూరు :** వ్యాసరచన పోటీల్లో ఏన్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మౌనశ్రీ అత్యంత ప్రతిభ కనబరిచింది. జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది మౌనశ్రీని బుధవారం మండల విద్యాశాఖ అధికారి వాసవి దేవి, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖమ్మంలో మంగళవారం టీషాట్, టీఎస్‌జిహెచ్ఎంఏ సంయుక్తంగా నిర్వహించిన కృత్రిమ మేధా అనే అంశంపై 9వ తరగతి చదువుతున్న మౌనశ్రీ ద్వితీయ స్థానం సాధించడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థిని, విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రాఘవరావు, జర్పుల పుల్లయ్య, వర్జీనియా, కమల సులోచన, శంకర్ రావు, నరసింహారావు పాల్గొన్నారు.

